

సమస్యలు పరిష్కరించండి

- 'తల్లిబిడ్డ సంరక్షణ' వాహన డ్రైవర్ల ధర్నా
- నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలి
- సిఐటియు నాయకుల డిమాండ్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద తల్లి బిడ్డ సంరక్షణ వాహన డ్రైవర్లు శుక్రవారం చిత్తూరు కలెక్టర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షులు కే సురేంద్ర, వాడ గంగరాజులు మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులను ఆస్పత్రులకు చేర్చే పథకాన్ని ప్రవేశ పెట్టడం మంచిదే అయినా అందులో పని చేస్తున్న డ్రైవర్లకు మాత్రం సంరక్షణ లేకపోవడం దారుణం అన్నారు. వాహనాల ఏజెన్సీ అరబిందో సంస్థ కండిషన్‌లో లేని వాహనాలు నడుపుతూ తల్లి బిడ్డలకు రక్షణ లేకుండా చేస్తోందన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో డ్రైవర్ల జీవనం దుర్భరంగా మారిందని ఇలా అయితే ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. ఉద్యోగ భద్రత లేదని అన్ని రకాల పనులు చేయిస్తూ పనిభారం పెంచుతున్నారన్నారు. తల్లి బిడ్డల సంరక్షణ పథకం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ డ్రైవర్లు 2016 నుండి పని చేస్తున్నారని, వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. ఫిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు బాస్ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తల్లి బిడ్డ సంరక్షణ వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

జేసికి వినతి

ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న 102 ఉద్యోగులు

గాలివాన బీభత్సం

- మామిడి , అరటి, కాకర పంటలకు భారీ నష్టం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- పలమనేరు, గుడిపాల మండలాల్లో వర్షం

ప్రజాశక్తి -పలమనేరు: చిత్తూరు జిల్లాలో పలమనేరు, గుడిపాల మండలాల్లో శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈ వర్షానికి పలమనేరు మండలంలో మామిడి, అరటి, కాకర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. గుడిపాల మండలంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరో వైపు ఎండ వేడిమికి వర్షం పడటంతో వాతావరణం చల్లపడడంతో ప్రజలకు ఇళ్ల నుండి బయటకు వచ్చి ఊపిరి పీల్చుకున్నారు.

పలమనేరులో శుక్రవారం సాయంత్రం గాలితో కూడిన భారీ వర్షం కురవడంతో పలమనేరు మండలంలోని ముసలమడుగు గ్రామంలోని రైతులకు చెందిన మామిడి, అరటి, కాకర పంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. మొసలిమడుగు గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకుడు ఉమాపతి నాయుడు మాట్లాడుతూ తమ గ్రామంలో తనకు చెందిన ఐదు ఎకరాల మామిడి తోట పూర్తిగా మామిడి కాయలు నేల రాలిపోయాయని, రైతు మురగేసుకు చెందిన


పలమనేరులో నేల రాలిన మామిడి కాయలు


పలమనేరులో నేల కూలిన అరటి చెట్లు

3 ఎకరాల మామిడి తోట, ఎకరం అరటి తోట అర ఎకరం కాకర తోట పూర్తిగా నేల పాలైందని తెలిపారు. చంద్రశేఖర్ నాయుడు అనే రైతుకు చెందిన ఐదు ఎకరాల మామిడి తోటలో కాయలు పూర్తిగా నేల రాలాయని, మునస్వామి నాయుడు అనే రైతుకు చెందిన 3 ఎకరాల మామిడి తోట కాయలు పూర్తిగా నేల రాలిపోయాయని తెలిపారు. ఇంకా పలు గ్రామాల్లో అనేకరకాల పంటలు అకాల వర్షానికి భారీ నష్టం సంభవించిందని రైతులు తెలిపారు. దాదాపు భారీ వర్షం కురిసింది. మొసలి మడుగు గ్రామానికి చెందిన చంద్రవేణెమ్మ అనే రైతుకు చెందిన 13 ఎకరాల మామిడి తోట మామిడికాయలు పూర్తిగా నేల రాలి అపార నష్టం కలిగించింది.

నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు

గుడిపాల: గుడిపాల మండలంలో శుక్రవారం గాలి వాన బీభత్సం సృష్టించడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. రాసన పల్లి వెళ్లే దారిలో చెట్లు రోడ్డుపై పడడంతో స్థానికులు సహకారంతో వాటిని తొలగించారు. సాయంత్రం నుండి మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాలలో అరటి చెట్లు, పంటలకు తీవ్ర స్థాయిలో నష్టం కలిగించింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు విన్నవిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్‌ను పునరుద్దరించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు.


గుడిపాలలో విరిగిన విద్యుత్ స్తంభం

ఉపాధ్యాయ ఉద్యమంలో దాచూరికి ప్రత్యేక స్థానం


దాచూరి రామిరెడ్డికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయ ఉద్యమంలో దాచూరి రామిరెడ్డికి ప్రత్యేక స్థానం ఉందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ దాచూరి రామిరెడ్డి తొమ్మిదవ వర్ధంతిని పురస్కరించుకొని యుటిఎఫ్ ఐరాల శాఖ ఆధ్వర్యంలో దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల హక్కుల కోసం దాచురి రామిరెడ్డి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఐరాల శాఖ నాయకులు కృష్ణారెడ్డి, జగన్నాథ నాయుడు, అరుణ కుమార్ తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మెకు మద్దతు తెలుపుతున్న 102 డ్రైవర్లు

సిహెచ్‌వోల సమ్మెకు 102 డ్రైవర్ల మద్దతు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయం వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేస్తున్న సమ్మె శుక్రవారం ఐదవ రోజుకు చేరుకుంది. వారికి 102 డ్రైవర్లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు 102 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజులు మాట్లాడుతూ ఐదు రోజులుగా చేస్తున్న సమ్మె పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రజలకు వైద్య సేవలు అందించేలా చేయాలని డిమాండు చేశారు. గ్రామీణ ప్రజలు ఈ సంవత్సరం వైద్య సేవలు అందుకుండా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. విధులు కేటాయించే ముందు నిర్దిష్టమైన విధి విధానాలు అవలంబించాలని పనిభారం తగ్గించాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండు చేశారు. వారి సమస్యలు పరిష్కరించకుంటే వారి పోరాటాలకు మద్దతు తెలుపుతామని కార్మికులు తెలిపారు.


మామిడి తోటల కంచె, తోటలను ధ్వంసం చేసిన ఏనుగులు

ఏనుగుల దాడి నుండి రక్షణ కల్పించాలి

రైతుల అభ్యర్థన

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:

సోలార్ ఫెన్సింగ్, కందకాలు తవ్వి తమ పంటలకు ఏనుగుల దాడుల నుండి రక్షణ కల్పిం చాలని రైతులు కోరుతు న్నారు. మండలంలోని మొగిలి గ్రామ సమీపంలో శివరాంరెడ్డి, మొ గుల ప్పలకు చెందిన వరి పంట, మామిడి తోటకు ఫెన్సింగ్ చేశామని రైతులు తెలిపారు. అయినా బుధవారం రాత్రి కంచెను ధ్వంసం చేసి ఏనుగులు తమ పంటలపై దాడి చేసి నష్టం కలిగించాయని, రెండు రోజులు అవుతున్నా సంబంధిత అధికారులు ఇంతవరకూ పరిశీలించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కందకాలు , సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఏనుగుల దాడులు పూర్తిగా నివారించాలని రైతులు కోరుతున్నారు.


ఏనుగు దాడిలో ధ్వంసమైన ఎల్లప్పకు చెందిన టమోటా పంట

రొంపిచర్ల: పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ గంటవారిపల్లికి రైతు ఎల్లప్పకు చెందిన టమోటా పంట, మరో రైతు ప్రభాకర్‌కు చెందిన వరి పంటను శుక్రవారం తెల్లవారుజామున ఒంటరి ఏనుగు ధ్వంసం చేసి పంటలను నాశానం చేసి నష్టం కలిగించింది. ఏనుగుల దాడులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి

- బిసి హాస్టల్ విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్ల ప్రదానంలో కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధనకు శ్రమించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో బీసీ వసతి గృహాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 500కు పైగా మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్లు శుక్రవారం అందించి, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్‌కు ఓ లక్ష్యం నిర్దేశించుకుని దాన్ని సాధించే వరకు నిరంతరం శ్రమించాలని పిలుపు నిచ్చారు. విద్యార్థుల ఆలోచనలను తప్పుదోవ పట్టించే సామాజిక మాధ్యమాల కు దూరంగా ఉండాలని సూచించారు. ప్రపంచంతో పోటీపడేలా మాతృభాషలో ప్రావీణ్యంతో పాటు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలన్నారు.

మెరిట్ పొందిన విద్యార్థులు వివరాలు

పలమనేరు ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహానికి చెందిన యు రాకేష్ యాదవ్ 553 మార్కులు, పుంగనూరు బీసీ బాలుర వసతి గృహం విద్యార్థి జి చరణ్ తేజ 552 మార్కులు, వికోట బీసీ బాలికల వసతి గృహం విద్యార్థి కుమారి ఎం వర్ష 546 మార్కులు సాధించారు. పుంగనూరు బీసీ బాలుర వసతి గృహం విద్యార్థి సిపి దీపక్ 543 మార్కులు, కత్తిరిపల్లి బీసీ బాలుర వసతి గృహానికి చెందిన ఈ తరుణ్ 519 మార్కులు పొందారు.


కలెక్టర్ పంపిణీ చేసిన మెరిట్ సర్టిఫికెట్లతో బిసి హాస్టల్ విద్యార్థిని విద్యార్థులు

విఆర్‌కుప్పం బీసీ బాలుర వసతి గృహం విద్యార్థి ఓ జితీష్ 518 మార్కులు, పచ్చికాపలం బీసీ బాలల వసతి గృహం విద్యార్థి జి దినేష్ 503 మార్కులు సాధించారు. పాలసముద్రం బీసీ బాలికల వసతి గృహానికి చెందిన కుమారి సి తులసి 502 మార్కులు, వికోట బీసీ బాలికల వసతి గృహం విద్యార్థిని కుమారి పి గాయత్రి 501 మార్కులు పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి కే మునీంద్రయ్య, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ జగ్గయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు సోమ సుందర్ రెడ్డి, కుప్పుస్వామి, ఉమాదేవి, హేమలత, కోటేశ్వరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

'అపోలోపై ప్రజా దండయాత్ర'లో సంతకాల సేకరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ' అపోలో వద్దు.. ప్రభుత్వమే ముద్దు..' అంటూ నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగం గా ఐదవ రోజు శుక్రవారం సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వేలాది మంది ఉదయం నుండి స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేశారు. తమ బిడ్డను పోగొట్టుకున్నట్లు బాధితుల బంధువులు సంతకాలు చేశారు. సంతపేటలోని టిడిపి నాయకులు



సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గ తండ్రి, మాజీ టౌన్ బ్యాంక్ ఛైర్మన్ పి షణ్ముగం, నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి శోభ రాణి, మాజీ కార్పొరేటర్లు సీఎం విజయ, కంద, ఈశ్వర్, టిడిపి నాయకులు వివిధ హోటళ్లలో వున్న వాళ్లు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిర్వహించాలి

నీట్ -2025 పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ సుమిత్ కుమార్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఈ నెల 4వ తేదీ చిత్తూరులో నిర్వహించనున్న నీట్ -2025 ప్రవేశ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ప్రశాంత వాతా వరణంలో నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి ఈ నెల 4 వ తేదీ చిత్తూరు ని పివికెయన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సావిత్రమ్మ డిగ్రీ కళాశా లలో నిర్వహించనున్న నీట్ -2025 ప్రవేశ పరీక్షల కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యంబిబిఎస్, బిడిఎస్, బిఏఎంఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్న నీట్ పరీక్షలకు సంబంధించి చిత్తూరు జిల్లా కేంద్రంలోని పివికేయన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (432 మంది), సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల (278 మంది)హాజరు కానున్నారని తెలిపారు. ఈ నెల 4వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని, పరీక్షా కేంద్రాల వెలుపల విద్యార్థుల తల్లిదండ్రులు వేచి ఉండడానికి షామియానా, తాగునీరు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్‌లు అందుబాటులో ఉంచాలని, పరీక్షా కేంద్రాలలోకి ఇన్విజిలేటర్లు, విద్యార్థులు ఎవరూ సెల్ ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని, అనుమతి లేదని వీటిని ప్రత్యేక కౌంటరులో భద్ర పరచాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో రెవెన్యూ , పోలీస్ శాఖల తరపున నియమించిన నోడల్ అధికారులు ఉంటారని, పరీక్షా కేంద్రాలలో సిట్టింగ్ ఆరేంజ్‌మెంటు, ఫ్యాన్‌లు వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశం చారు. ఎస్పి మాట్లాడుతూ ప్రశ్నా పత్రాలను ఆర్మ్ద్ పోలీస్ బందోబస్తు ఎస్కార్ట్‌తో పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లే సమయంలో పూర్తి స్థాయిలో వీడియో, ఫోటోగ్రఫీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పివికెయన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి తూట్లు

- ప్రజలకు తప్పని తిప్పలు
- స్పందించని అధికారులు


అంబేద్కర్ కాలనీలో మరమ్మతులకు నోచుకోని చేతి బోరు

నడి నెత్తిమీద సూరీడు భగభగమంటున్నాయి.. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతున్నాయి.. చెమటలు కక్కుతూ ప్రజలు వేసవి తాపంతో ప్రతి అర్ధ గంటకు ఒకసారి నీరు తాగాల్సిన పరిస్థితి.. వేసవి వస్తే ప్రజలకు నీటి అవసరాలు ఎంతో వుంది.. ప్రభుత్వం, జిల్లాస్థాయి అధికారులు పదేపదే ప్రజలకు తాగునీటి ఎద్దడి నివారణకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని చెబుతుం టారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల పనితీరు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో తాగునీటి పథకానికి తూట్లు పడుతున్నాయి. సరైన రీతిలో ప్రజలకు తాగునీరు అందక తిప్పలు పడుతు న్నారు. స్పందించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం గమనార్హం..

ప్రజాశక్తి-పూతలపట్టు: ప్రభుత్వాలు మారుతున్నా.. అధికారులు మారుతున్నా తాగునీటి విషయంలో మాత్రం ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ కుళాయి.. అన్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినా ఫలితం అంతంత మాత్రంగానే కనిపించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో తాగినీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పినా.. వారి మాటలు నీటి మూటలుగానే మారాయి. నేటికీ అనేక గ్రామాల్లో ప్రజలు తాగునీటికి విలవిలలాడుతున్నారు. చేతి బోర్లు, బోరు మోటార్లు మరమ్మతులకు గురైననా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతు న్నారు. గ్రామీణ ప్రాంతాల దాహార్తిని తీర్చే చేతి బోర్లు ఎక్కడ చూసినా నిరుప యోగంగా దర్శనమిసు న్నాయి. ప్రస్తుతం నీటి బోర్ల స్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కొన్నిచోట్ల తాగునీటి ట్యాంకులు మరమ్మతులకు నోచుకోక అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

మండలంలోని తాగునీటి దుస్థితి

పూతలపట్టు మండలంలో చేతిబోర్ల పరిస్థితి మాత్రం అత్యంత దారుణంగా వుంది. మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో మూడు నెలల క్రితం మరమ్మతుల కోసం చేతి బోరు పైపులను పైకి తీశారు. అప్పటినుంచి పట్టించుకోక పోవడంతో చేతిబోరు, పరికరాలు రోడ్డుపైనే పడి ఉన్నాయి. బోరు మరమ్మతులు చేపట్టాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజ నం శూన్యమని కాలనీవాసులు వాపో తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పక్కాల గుట్టలో సుమారు 60 కుటుంబాల తాగునీటి అవసరాలను దృష్టిలో వుంచుకుని తాగునీటి ట్యాంకు నిర్మాణాలు మొదలుపెట్టారు. కారణాలు ఏవైనా పనులు అసంపూర్తిగా వదిలేశారు. సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇకనైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కిశోరి బాలికా వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న సిడిపివో అరుణకుమారి

ప్రజాశక్తి - వి కోట : ప్రభుత్వం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిశోరి బాలిక వికాసం ద్వారా మహిళలు వారి హక్కుల సంరక్షణపై అవగాహన కలిగి వుండా లని బైరెడ్డిపల్లి సిడిపివో అరుణకుమారి తెలిపారు. మండల కేంద్రమైన వి కోటలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో సర్పంచ్ పిఎన్ లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి వారు విచ్చేసి ప్రసంగించారు. మండల స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బందికి గతంలో కల్పించిన శిక్షణలో వారి హక్కులు తెలుసుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది బాల్య వివాహ నిర్మూలన నిరోధక చట్టం, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే అనర్థాలు వివరించారు. మహిళల ఆరోగ్యం, పోషణ, రుతుక్రమంలో పాటించాల్సిన శుభ్రత తదితర అంశాలను వివరించారు. సమాజంలో బాలికలను రక్షించ కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ పి యన్ లక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



బంగారుపాళ్యం: పౌష్టికాహారంతోనే కిశోర బాలికలు ఎదుగుదల సాధ్యమవుతుందని సర్పంచ్ వాణి ప్రియ అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో కిశోరి బాలిక వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు యుక్త వయసుకు వచ్చినప్పుడు శరీర ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమన్నారు. శరీరంలో ఏర్పడ్డ మార్పుల వల్ల వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గుర్తించాలని వారికి క్రమేపి శక్తివంతమైన ఆహారం అందించి కిశోర బాలికలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి దిలీప్, ఏఎన్ఎం రోజా రమణి, అంగన్వాడీ కార్యకర్తలు రత్నకుమారి, భారతి, సూర్య కుమారి, కిశోర బాలికలు, గర్భిణులు, పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో

బైరెడ్డిపల్లి: కిశోరి వికాసం సమ్మర్ క్యాంపులో భాగంగా డాక్టర్ పద్మావతి శుక్రవారం ఓరియంటేషన్ మండలంలోని తీర్థం గ్రామ పంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కిశోరి వికాసం వికాసం సమ్మర్ క్యాంప్ ప్రోగ్రాం పరిచయ కార్యక్రమం, లీడర్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ 11 సంవత్సరాల నుండి19 సంవత్సరాల వరకు పిల్లలలో అనేక మార్పులు వస్తాయని ఈ వయస్సులో వచ్చే ఆలోచనలు అదుపులో పెట్టుకోవాలని మంచి మార్గంలో ముందుకు నడవాలని వివరించారు. కాంతమ్మ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత వివరిస్తూ బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి హెచ్ ఎస్ శ్రీదేవి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుజాత శిరీష, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యాదమరి: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ఐసిడిఎస్ సూపర్వైజర్ సార్థ కుమారి అన్నారు. శుక్రవారం కీనాటం పల్లి పంచాయతీలోని గుట్ట కింద హరిజనవాడ అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ మనీ వేలు ఆధ్వర్యంలో కిశోరి బాలిక వికాసం కార్యక్రమంలో భాగంగా మహిళల హక్కులను రక్షణపై అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యాదమరి: లక్ష్యాలను నిర్దేశించుకుంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని సిడిపిఓ వాణిశ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని జంగాలపల్లి అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం విభిన్న అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికల లీడర్ ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత, సర్పంచ్ రమేష్ బాబు, సచివాలయ పోలీస్ కల్పన, అంగన్వాడీ టీచర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.



ఐరాలలో

ఐరాల: కాణిపాకం గ్రామ సచివాలయంలో గౌరవ సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి అధ్యక్షతన కిశోరి వికాసం - వేసవి శిక్షణా కార్యక్రమాల ప్రణాళిక ఆవిష్కరించారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా కిశోరి బాలబాలికతో పరిచయ వేదిక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 11-19 మధ్య వయస్సు అత్యంత కీలకమైందని నేటి బాలలు రేపటి పౌరులు అని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రమీల మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణగా మెలగాలని, తల్లితండ్రులను గౌరవించి నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలబాలికలు, మహిళా పోలీస్ భార్గవి, ఎఎన్ఎం నిర్మల, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రసన్న, డిజిటల్ అసిస్టెంట్ జయంతి, వార్డు మెంబర్ సౌందరజన్,అంగన్వాడీ టీచర్లు, ఏపీఎం,వెలుగు సిసి, ఆశా వర్కర్లు పాల్గొని పిల్లలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రేపు భగీరథ మహర్షి జయంతి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఈ నెల 4వ తేదీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మే 4వ తేదీ ఆదివారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను కలెక్టర్ కార్యాలయంలో, పాత గ్రీవెన్స్ హాలు వివేకానంద భవనంలో అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహర్షి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానం అలవరుచుకోవాలి: ఎంపివో

ప్రజాశక్తి -యాదమరి: ప్రతి రైతు వ్యవసా య పంటలు పండించడంలో సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని యదమరి మండల వ్యవసాయ అధికారి చరిత పేర్కొన్నారు. మండల పరిధిలోని జంగాల పల్లి, 12 కమ్మపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో స్కిల్ అప్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్ శిక్షణను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా రైతులకు అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం అలవరుచుకుని మేలైన వ్యవసాయం ద్వారా అధిక రాబడి, వారి జీవన శైలిలో మార్పు రావాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహిం చారు. ఇందులో భాగంగా రైతులకు వ్యవసాయం లో వివిధ రకాల స్మార్ట్ ఫోన్ యాప్స్, డిజిటల్ చెల్లింపుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతు తన స్వతహాగా వాతావరణ స్థితిని తెలుసు కోవడం, వివిధ రకాల మార్కెట్లో పంటల ధరలు తెలుసు కుని తద్వారా అధిక రాబడి పొందడం వ్యవ సాయంలో యూట్యూబ్ ప్రాముఖ్యత, వినియోగం, ప్రభుత్వానికి సంబంధించిన వివిధ రకాల పథకాలు గురించి రైతులకు పూర్తిగా వివరిం చారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారులు సాయి సింహారెడ్డి , అనిత, పర్యవేక్షణా ధికారి ఢిల్లీ ప్రసాద్, భవాని , మండల వ్యవసాయ అధికారి చరిత పాల్గొన్నారు.



స్మార్ట్ ఫోన్ యాప్స్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ అధికారి



ఆలయ వార్షికోత్సవానికి విచ్చేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ఘనంగా కుప్పమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని బుక్కాపట్నం పంచాయతీ మర్రిమానురు గ్రామంలోని కుప్పమ్మ దేవత ఆలయ వార్షిక పూజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కుప్పమ్మ ఆలయానికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. ఆయన అమ్మవారిని దర్శనం చేసుకోగా, అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో నేతలు అనిత, ముని రాజారెడ్డి, వెంకటరెడ్డి, గుణశేఖర్ రెడ్డి, హరిబాబు, సురేంద్ర రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, ఏకాంబరం, రూపకుమార్ రెడ్డి, గోవిందరెడ్డి, వెంకటేష్ రెడ్డి , వేలు మొదలియార్, కేశవరెడ్డి, పెద్దబ్బ రెడ్డి, వరదరాజుల రెడ్డి, రఘునాధ రెడ్డి, అయిలు రెడ్డి, అయ్యప్ప రెడ్డి, జగదీష్, ఢిల్లీ, గోవిందన్ పాల్గొన్నారు.

15 రోజులు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -పలమనేరు : పలమనేరు పట్టణంలో కులమతాలకు అతీతంగా నిర్వహించే గంగ జాతరకు విభిన్న మతాలు, కులాలకు చెందిన అందరూ కలిసిమెలిసి గంగ జాతర చేసుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా గంగా జాతర చాటింపు మొదలు గంగ జాతర పూర్తయ్యే వరకు 15 రోజులు మధ్యాహ్నం గంగమ్మ గుడి వద్ద వచ్చే భక్తులకు లారీ వర్కర్స్ యూనియన్ లీడర్ వారి స్నేహితులతో కలిసి మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఇదే రీతిలో ఎండలో గుడికి వచ్చే భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం, ఒక రోజు అన్నదానం నిర్వహిస్తున్నామని ఇలా చేయడం తనకెంతో ఆనందమని, అందరితో కలిసి గంగ జాతర జరుపుకోవడం ఎంతో సంతోషంగా భావిస్తున్నామన్నారు.

జనసేన కార్యకర్త మృతి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలం లోని బెలుపల్లి పంచాయతీ కంచనపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ బీసీ నాయకు డు సెల్వ రాజు కుమారుడు ప్రదీప్ శుక్రవారం మృతి చెందాడు. ప్రదీప్ జనసేనలో జనసేన కార్యకర్తగా చాలా అంకితంతో పనిచేశారు. ప్రదీప్ అకాల మరణం చెందడం చాలా పంచాయతీ వాసులు చాలా బాధాకరమని పలువురు పేర్కొన్నారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలుపుతూ ప్రదీప్ మృతదేహానికి పూల మాలవేసి పలువురు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మృతి చెందిన ప్రదీప్ (ఫైల్ ఫొటో)

లక్ష్మప్పకు నివాళి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని గంగి నాయన పల్లి గ్రామ పంచాయతీలో వైసిపి సీనియర్ నాయకుడు గంగి నాయన పల్లి లక్ష్మప్ప కొంతకాలంగా అనారోగ్యానికి గురై గురువారం తుది శ్వాస విడిచారు . విషయం తెలుసు కున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి , స్థానిక సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి శుక్రవారం లక్ష్మప్ప ఇంటి వద్దకు చేరుకొని ఆయన మృతదేహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కార్తికేయన్ వైస్ ఎంపీపీ నారాయణస్వామి, బైరెడ్డిపల్లి సర్పంచ్ వెంకటేష్, స్థానిక సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి, ఎంపీటీసీ లు పంచాయతీ వైసిపి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

రైతులకు ప్రకృతి వ్యవసాయం ఓ వరం

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : ప్రకృతి వ్యవసాయం రైతులకు ఓ వరమని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారు లు కుప్పం పట్టణంలోని వ్యవసాయం మార్కెట్ యార్డ్ ఆవరణలో రైతులకు శుక్రవారం అవగాహన నిర్వహిం చారు. ఇందులో భాగంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించ డంతో పాటు పాడి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఆధునిక సమాజంలో రసాయ నాలను, క్రిమిసంహారక మందులను ఉపయోగించి నిర్వహి స్తున్న వ్యవసాయం ద్వారా పండిన ఆహార ధాన్యాలు, కూరగాయలు మానవాళి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందన్నారు. ప్రధానంగా వ్యవ సాయంలో రసాయన పద్ధతులు ఉపయోగించడం వల్ల భూ సారం తగ్గి, పంట దిగుమతి సైతం తగ్గిపోతోందన్నారు. అదే ప్రకృతి వ్యవసాయంలో భూసారాన్ని పెంచే పద్ధతులను ఉపయోగించడం వల్ల, వ్యవసాయంలో దిగుబడి పెరిగి, రైతులు లాభపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వ్యవసాయంలో కార్బన్ క్రెడిట్ తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా పాడి రైతులకు ఉపయోగపడే బయోగ్యాస్ తయారీ పద్ధతులను వివరిస్తూ, బయోగ్యాస్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ పి (టి ఎల్) రాము, చిత్తూరు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు, ప్రత్యేక అధికారి అమృతవల్లి, ఎన్ఎఫ్ఏ గురుప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

యుగంధర్‌కు ఆత్మీయ సత్కారం

పజాశక్తి- చిత్తూరు అర్బన్ : జనసేన సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పొన్న యుగంధర్ కు అవార్డు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని చిత్తూరు జిల్లా జనసేన నాయకులు ఎం మహేష్ స్వేరో, పూల చైతన్య తమ బృందంతో చిత్తూరు నగరంలో శుక్రవారం దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్ స్వేరో మాట్లాడుతూ పొన్న యుగంధర్ సేవలు, పోరాట పటిమ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం చేసే కృషి అభినందనీయమని కొనియాడారు. ఆయనకి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు రావాలని, ఎల్లప్పుడూ పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేసే యుగంధర్ లాంటి మంచి నాయకులు ఈ సమాజానికి చాలా అవసరమని పేర్కొన్నారు. ఆయన సేవలు జనసేనకి రెట్టింపు స్థాయిలో ఉపయోగపడ తున్నాయన్నారు. పలువురు ఆయనను అభినందించారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాఘవ, సాయి, కిషోర్, వీకోట మండల అధ్యక్షులు మహేష్ బాబు, యువరాజ్ స్వేరో, బబ్లూ, చందు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న జెసిబి
ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -గుడిపాల: జెసిబి ఎలక్ట్రిక్ ఆటోను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గుడిపాల మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. గుడిపాల ఎస్సై రామ్మోహన్ కథనం మేరకు.. వెల్లూరు నుండి చిత్తూరు వైపు వెళుతున్న ఏపీ 26 ఏజే 6976 జెసిబి , చిత్తూరు నుండి వేలూరు వైపు వెళుతున్న ఏపీ 39 డబ్ల్యూ డి2074 ఎలక్ట్రిక్ ఆటోను అనుపు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో రుష్యేంద్రబాబు(35), భువన చంద్ర (5) తలకు తీవ్రత గాయాలయ్యాయి. వీరిని వెంటనే అంబులెన్స్ ద్వారా సీఎంసి ఆసుపత్రికి తరలించారు. జెసిబి డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంగా నడపడంతోనే ఈ సంఘటన చోటు చేసుకుందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



జెసిబి ఢీకొన్న ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

చంద్రశేఖర్ రెడ్డి ఆరోపణలు అన్యాయం


ఇరిగేషన్ శాఖ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు పి కుమార్ స్వామి యాదవ్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ఉద్యోగ, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి చిత్తూరు పర్యటనలో భాగంగా చేసిన ఆరోపణలు అన్యాయమని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇరిగేషన్ శాఖ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు పి కుమార్ స్వామి యాదవ్ ఖండించారు. గత వైసిపి ప్రభుత్వం ఉద్యోగులకు ఏదో మేలు చేసిందని.. కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుందంటూ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు రోజుల్లో సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తారని నాటి వైసిపి ఇచ్చిన హామీ ఏమైందని ఐదేళ్లలో ఎప్పుడైనా ప్రశ్నించారా?' అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం ఉద్యోగుల కనీస హక్కులను కలరాసిందని, పిఆర్సీ పిట్మెంట్ తగ్గించి ఇచ్చారని, జిపిఎస్ రుణాలను నిలిపివేశారన్నారు. రుణాలు అందక ఎంతోమంది పెళ్లిళ్లు రద్దు చేసుకున్నారు కదా..? అప్పుడు ఎందుకు మీరు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదన్నారు. ఉద్యోగులకు ఒకటవ తేదీ జీతాలు ఎందుకు ఇవ్వాలంటూ మంత్రులు అవహేళన చేయడం ఎవరు మర్చిపోలేదన్నారు. నాటి ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల స్వేచ్ఛను హరిస్తూ.. కనీసం సమావేశాలు పెట్టాలనుకున్న.. పోలీసుల తో ఎలా వేధించారో మీకు తెలియదా? అన్నారు. అక్రమ కేసులు పెట్టి, గృహ నిర్బంధాలు చేసి, నోటీసులు ఇచ్చి ఉద్యోగులను వేధించినప్పుడు మీరు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగస్తులకు ఒకటి రెండు తేదీల్లోనే వేతనాలు వస్తున్నాయని విషయం ఓ ఉద్యోగిగా మీకే తెలుసన్నారు. గత ప్రభుత్వంలో 20వ తేదీ పైన జీతాలు వచ్చినప్పుడు ఉద్యోగుల పక్షాన మీరు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని, గత ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా ఉంచిన సొమ్ములను ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తుందని, ఉద్యోగుల జిపిఎఫ్ రుణాలు రూ.650 కోట్లు చెల్లించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉద్యోగులకు త్వరలోనే ఒక మంచి పిఆర్సీ వస్తుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల పట్ల ప్రేమ ఉన్నట్లు నటిస్తూ చేసే తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయం

రియల్ సంస్థ అధ్యక్షులు ఎస్ రామారావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : బాల్య వివాహాలను నిర్మూలనే తమ సంస్థ ప్రధాన ధ్యేయమని రియల్ సంస్థ జిల్లా అధ్యక్షులు ఎస్ రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం స్థానిక కన్నయ్య నాయుడు కాలనీ ఆర్ఫియా మసీదులో బాల్య వివాహాల నిర్మూలనపై మత పెద్దల ద్వారా ముస్లిం మైనార్టీలకు అవగాహన కల్పించారు. తొలుత బాల్య వివాహాల నివారణపై ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లా డుతూ కైలాస్ చతుర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ద్వారా భారతదేశంలోని 400 జిల్లాల్లో రియల్ సంస్థ బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్రంలో 25 మంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నా రు. అందులో భాగంగా గత నెల 30 తేదీ అక్షయతృతీయ రోజు అనేక బాల్య వివాహాలు అడ్డుకున్నామన్నారు. పలు ప్రాంతాల్లో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించామని, 20 సంవత్సరాలకు పైగా రియల్ సంస్థ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏడాది తమ రియల్ సంస్థ ద్వారా మొత్తం 315 బాల్య వివాహాలు అడ్డుకోవడంతో పాటు, మరో 30 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామన్నారు. బాల్య వివాహాల వల్ల బాలల హక్కులకు భంగం వాటిల్లుతోందన్నారు. బాలల మానసిక ఎదుగుదల కుంటుపడుతోందని, ఆ ప్రభావం వారి దాంపత్య జీవితాల్లోనూ ఇబ్బందులు కలిగిస్తాయన్నారు. రాజ్యాంగం ప్రకారం బాలలకు తల్లిదండ్రులతో కలిసి నివసించే హక్కు, మంచి ఆరోగ్యాన్ని పొందే హక్కు, విద్యా హక్కు, స్వేచ్ఛ హక్కు, జీవించే హక్కు, అన్ని రకాల హింస, బాధలు తప్పుడు ప్రవర్తనల నుండి రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు పలు అంశాల్లో పాల్గొనే హక్కు వుంటాయన్నారు. వీటిలో ఏ హక్కును హరించినా, భంగం వాటిల్లినా చట్టపరంగా చర్యలు తీసుకునే వీలుంటుందన్నారు. ఈ విషయంలో బాధ్యతగల పౌరులందరూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. చిత్తూరు జిల్లాలోని పలు ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక అవగాహన కల్పించామన్నారు. మరో వారం రోజులు నిర్వహిస్తామని తెలిపారు. చిత్తూరు ప్రభుత్వ ఖాజీ కమలుల్లా జుహూరీ మాట్లాడుతూ యువతులకు 18 సంవత్సరాలకు పైగా, యువకులకు 21 సంవత్సరాల వయస్సు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. అలా చేస్తేనే మానసికంగా ఎదుగుదల సాధిస్తారని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కేంద్రంలోని అన్ని మసీదులలో ముస్లిం మైనారిటీలకు అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీ నైముల్లా, మత పెద్దలు నవాబ్ ఖాన్, అబ్దుల్ రషీద్, సులేమాన్ సాహెబ్, మహమ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రియల్ సంస్థ అధ్యక్షులు

క్రైం న్యూస్

బస్సుఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని నల్లగాంపల్లి వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రసాద్ కథనం మేరకు బంగారుపాలెం మండలం, జిల్లేడుపల్లి పంచాయతీ జె కొత్తూరు గ్రామానికి చెందిన రాఘవరెడ్డి కుమారుడు చంగల్ రెడ్డి (70) నలగంపల్లి సమీపంలోని వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్లేందుకు ఆలయానికి ఎదురుగా జాతీయ రహదారి దిగి రోడ్డు దాటుతుండగా ఆ సమయంలో చిత్తూరు వైపు నుండి పలమనేరు వెళుతున్న బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో చెంగల్ రెడ్డికి తీవ్ర గాయాలు కాగా చిత్తూరు ప్రభుత్వానికి చికిత్స నిమిత్తం తరలించారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన చెంగల్‌రెడ్డి

మాజీ ఎంపిటిసి ఇంట్లో చోరీ
నగదు, బంగారం అపహరణ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు రూరల్ మండలం కొలమాసన పల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ మంజుల రెడ్డి ఇంట్లో గురువారం రాత్రి నగదు, బంగారం చోరీకి గురైంది. గురువారం సాయంత్రం మంజులా రెడ్డి కుటుంబం శాంతిపురంలో ఒక పెళ్లికి వెళ్లి తిరిగి వచ్చేసరికి తమ ఇంటి బయట వైపు కిటికీని తొలగించి, లోపలికెళ్ళి, బీరువాని పగలగొట్టి అందులో వున్న రూ.80 వేలు నగదు, 20 గ్రాముల బంగారును ఇతర విలువైన సామగ్రిని గుర్తు తెలియని దొంగలు దోచుకెళ్లారని పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు పోలీసు దర్యాప్తులో తెలియాల్సి వుంది.



చోరీకి గురైన మాజీ ఎంపీటీసీ మంజుల రెడ్డి ఇల్లు

గంగ జాతర చాటింపులో ఉద్రిక్తత
- యువకుడికి కత్తిపోట్లు - ఆరుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు పట్టణంలో గురువారం రాత్రి నిర్వహించిన గంగ చాటింపు గెరిగ ఊరేగింపు సందర్భంగా ఒక యువకుడికి కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. పలమనేరు పాతపేట అంబేద్కర్‌కు చెందిన డీకే సునీల్ కుమార్ అనే యువకుడిని పలమనేరు కొత్తపేట గాంధీ నగర్, మొండోళ్ల కాలనీ లకు చెందిన కళ్యాణ్, హరి, చరణ్, జయప్రకాష్, సాయి పవన్ మొదలగు ఆరుగురు యువకులు కలిసి కత్తులు రాళ్లు, గాజు ముక్కలతో ప్రణాళిక ప్రకారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో సునీల్ కుమార్ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతని పరిస్థితి కుదుటపడిందని స్థానికులు తెలిపారు. దీనిపై పలమనేరు సిఐ నరసింహరాజును వివరణ కోరగా వీరి మధ్య పాత కక్షలో నేపథ్యంలో గొడవపడి అతడిని చంపాలని ప్రయత్నిం చారన్నారు. అతను అపస్మారక స్థితిలో ఉండగా, ఆసుపత్రిలో చేర్చార న్నారు. ఈ దాడికి పాల్పడిన ఆరుగురి యువకులపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా అల్లరి మూకలు ఇలా దాడులకు ప్రయత్నించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా వారిపై నిర్దాక్షిణ్యంగా రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని సీఐ నరసింహారాజు హెచ్చరించారు.



గాయపడి చికిత్స పొందుతున్న బాధితుడు

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మహిళ అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి కథనం మేరకు మండలంలోని బసవరాజుకండ్రిగక గ్రామానికి చెందిన వెంకటరమణ భార్య ప్రమీల (21) ఈనెల 1న ఉదయం బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చుట్టు పక్కల వ్యవసాయ పొలాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రమీల ఆచూకీ లభించలేదు. దీంతో అదృశ్యమైన మహిళ అత్త లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చంద్రబాబు తెలిపారు.